
# మధ్యాహ్నం



న్యూయార్క్ నించి బాంబే వెళ్ళే విమానంలో, తన సీటు చూసుకుని కూర్చున్నాడు గోపాలం.

అటు మూడు ఇటు మూడు మధ్యలో నాలుగు సీట్లున్న ఎయిర్ ఇండియా వారి బోయింగ్ 747 విమానం అది. గోపాలానికి ఐల్ సీటు ఇష్టం కనుక, అదే అడిగి తీసుకున్నాడు. విండో సీటు, మధ్య సీటు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. అందంగా భారతీయ పద్ధతిలో అలంకరించి, వెనకాల సితార్ సంగీతం వినిపించటం వల్ల, మనసుకి ఆహ్లాదకరంగా వుంది.

పైన హాండ్ లగేజి పెట్టి, తన సీటులో కూర్చోబోతుండగా వచ్చిందావిడ. చూడటానికి చాల పెద్దావిడలా కనిపిస్తున్నది. గోపాలాన్ని చూసి విండో సీటు వేపు చేయి చూపించింది. అతను చిరునవ్వు నవ్వి పక్కకు తప్పుకుని ఆవిడ కూర్చోవటానికి దారి యిచ్చాడు. ఆవిడ చేతిలోని బాగ్‌ను పైకెత్తలేక, గోపాలాన్ని చూసి "బాగ్" అని లగేజ్ రాక్ వేపు చూపించింది. గోపాలం ఆవిడ సంచిని పైన పెట్టాడు.

విమానం బయలుదేరుతున్నా, మధ్య సీటులోకి ఎవరూ రాకపోవటంతో "అమ్మయ్య కనీసం లండన్ దాకా కాస్త విశాలంగా కూర్చోవచ్చు" అనుకున్నాడు.

విమానం 37 వేల అడుగుల ఎత్తుకు వెళ్ళాక, పైలట్ సీట్‌బెల్టు సైన్ తీసేసి, ఎయిర్

హోస్టెస్‌లని ఇంక భోజనాలు సర్వ్ చేయటానికి సిద్ధం అవచ్చు అని ఎనౌన్స్ చేశాడు.

పక్కసీటావిడ కొంచెం గాబరాగా కనపడటంతో ఆవిడని కాస్త ప్రశాంతంగా ఉంచాలనే ఉద్దేశ్యంతో, గోపాలం ఆవిడని మాటల్లోకి దించాడు.

"మీరు ఏ భాష మాట్లాడతారు - తెలుగా, తమిళమా, హిందీనా?" అడిగాడు ఇంగ్లీషులో.

ఆవిడ "తెలుగే!" అన్నది స్వచ్ఛమైన తెలుగులో.

"నేనూ తెలుగువాడినే! నా పేరు గోపాలం. ఇక్కడి నించి బాంబే, హైదరాబాదు, గుంటూరు వెడుతున్నాను. మీరు ఎక్కడికి వెడుతున్నారు?" అడిగాడు.

"నేను లండన్‌లో దిగుతాను. న్యూయార్క్‌లో మా పెద్దబ్బాయి దగ్గర రెండు నెలలు ఉన్నాను బాబూ! మా రెండోవాడు, లండన్‌లో లా చదువుకుంటున్నాడు. వాడి దగ్గరో పది రోజులుండి, హైద్రాబాద్ వెళ్ళిపోతాను. ఇంగ్లీషు సరిగ్గా రాదు ప్రయాణమెలాగా అనుకుంటుంటే మంచి సహాయంగా కనపడ్డావు నాయనా, సంతోషం" అన్నదావిడ.

గోపాలం నవ్వాడు - "నేను చేసే సహాయమేవిటండీ. తెలుగులో మాట్లాడటమే కదా" అన్నాడు.

పైకి అలా అన్నాడే కాని ఆవిడకేం కావాలన్నా, పెద్దావిడకదా అని సహాయం చేస్తూనే ఉన్నాడు. ఆవిడ కూడా 'బాబూ, నాయనా' అంటూ ఆప్యాయంగా మాట్లాడుతుంటే గోపాలానికి, తన పెద్దక్కయ్య గుర్తుకొచ్చింది. తన భర్త రాష్ట్ర ప్రభుత్వంలో ఉద్యోగం చేసి రిటైర్ అయాడనీ, పిల్లలు జీవితంలో స్థిరపడిపోతున్నారనీ, తనకీ, తన భర్తకీ అన్ని బాధ్యతలూ తీరిపోయాయనీ, ఇంకా ఇద్దరూ కృష్ణా, రామా అనుకుంటూ, తమ శేషజీవితం గడిపేయ దలచుకున్నారనీ చెప్పిందావిడ.

లండన్ ఇంకో రెండు గంటల్లో వస్తుందనగా, ఎయిర్ హోస్టెస్ వచ్చి, లండన్‌లో దిగేవాళ్ళకి - డిసెంబార్క్‌మెంట్ కార్డు యిచ్చింది. అంటే లండన్‌లో దిగే విదేశీయుల పాస్‌పోర్టు, వీసా వివరాలు అడిగే కాగితం అన్నమాట. విమానం దిగంగానే, అక్కడ చూపించాలది.

"నాకు అది నింపటం ఎలాగో తెలీదు బాబూ. నువ్వు కాస్త సహాయం చేస్తావా" అని తన పాస్‌పోర్టూ, వీసా అందించిందావిడ.

గోపాలం ఆ వివరాలు నింపుతూ, ఆవిడ పుట్టిన తేదీ చూసి అదిరిపడ్డాడు. 1949లో పుట్టిందావిడ. అంటే ఆవిడ వయసు ఏభై ఏళ్ళు. తనకన్నా నాలుగేళ్ళు చిన్న. కానీ వయసులో ఎంత పెద్దావిడలా కనిపిస్తున్నది. అంతే కాదు, తన భార్య కమల వయసు కూడా అంతే. కమల

ఇంకా ఉద్యోగం చేస్తూనే వుంది. ఎంతో ఉత్సాహంగా అక్కడెన్నో సాంస్కృతిక, సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నది. రెగ్యులర్‌గా ఎక్సర్‌సైజూ, వాకింగూ చేయటం వల్ల, సన్నగా నాజూగ్గా కనిపిస్తుంది. మరి ఈవిడ ఇలా? ఎందువల్ల ఈ తేడా?

అక్కడినించీ హైద్రాబాద్‌లో తన అన్నయ్యగారింటికి వచ్చేదాకా, గోపాలం మనసులోని ఆ ఆలోచన బయటకు పోలేదు. గోపాలం అన్న చలపతి, సరిగ్గా ఒక సంవత్సరం క్రితమే ప్రభుత్వోద్యోగంలోనించి రిటైరయాడు. చలపతి తన ఒక్కగానొక్క కూతురికి రిటైర్ అవబోయే ముందే పెళ్ళి చేశాడు కూడాను.

మర్నాడు రాత్రి భోజనాలయాక, చలపతిని అడిగాడు గోపాలం - "అన్నయ్యా! రిటైరయావు కదా! మరి ఏం చేస్తున్నావు" అని.

కిళ్ళీ నములుతూ అన్నాడు చలపతి - "చేసేదేముంది. విశ్రాంతి తీసుకోవటమే. ఉండటానికో ఇల్లుంది కనుక, పెన్షన్ డబ్బులు సరిపోతాయి. అలా కాలక్షేపం చేసేయటమే!"

కొంచెం ఆశ్చర్యపోతూ అన్నాడు గోపాలం - "అదేమిటి. నీ జీవితంలో ఎన్నెన్నో సాధించాలనుకునే వాడివి. స్వంతంగా పుస్తకాల ప్రచురణ చేయాలనీ, మంచి తెలుగు పుస్తకాలని ఇంగ్లీషులోకి అనువదించి, ప్రచురించాలనీ కలలు కనేవాడివి. అదంతా ఏమయింది?"

చలపతి నవ్వాడు - "అవన్నీ వయసులో ఉన్నప్పటి ఆలోచనలు. ఈ వయసులో ఇంకా ఏంచేస్తాంరా అవన్నీ"

"అలాటివన్నీ, ఈ వయసులోనే చేయాలన్నయ్యా! ఇన్నాళ్ళూ, కుటుంబాన్ని పోషించటం, ఇల్లు కట్టుకోవటం, అమ్మాయికి పెళ్ళి చేయటం లాటి బాధ్యతలున్నాయి నీకు. ఇప్పుడు అవన్నీ సక్రమంగా నిర్వర్తించావు. ఇక నీ జీవితంలో, నీ ఆనందం కోసం, నీ తృప్తి కోసం, నీ కోసం, నువ్వు చేయాలనుకున్నవి చేసే సమయం వచ్చింది".

"ఏమోరా... ఏదీ చేయాలనిపించటం లేదు. బాగా పెద్దవాడిని అయిపోయాననిపిస్తున్నది".

ఈసారి గోపాలం నవ్వాడు. "ఏం పెద్దవాడి వన్నయ్యా? నీకు ఏభై తొమ్మిదేగా. నన్నడిగితే ఇదే మంచి ప్రైమ్ టైమ్. ఎన్నో చక్కటి పనులు చేయవచ్చు. ఇంకో ఉద్యోగం కానీ, మంచి బిజినెస్ కానీ, సంఘానికి ఉపయోగపడే ఏవో మంచి పనులు కానీ, ఏదో హాబీని ఒక వ్యాపకంగా మార్చుకోవటం కానీ, ఏదో ఒకటి చేయవచ్చు. అమెరికాలో మా ఆఫీసులోనే, అరవై అయిదేళ్ళు దాటినా, ఎంతో ఆరోగ్యంగా, ఉత్సాహంగా పనిచేసే వాళ్ళు నాకు తెలుసు".

"వాళ్ళకి డబ్బు కాపీనం ఉందేమోరా. నాకు లేదు. నేను సంపాదించింది నాకు చాలు"

ఎన్నేళ్ళ తర్వాతో, తన వాళ్ళని చూడటానికోసం ఇండియాకి వచ్చిన గోపాలం, తన అన్నతో వాదనకి దిగటం ఇష్టంలేక ఇంక ఏమీ అనకుండా వూరుకున్నాడు.

ఆరోజు సాయంత్రం, తన స్నేహితుడు ప్రసాద్‌ని చూడటానికి, అతని ఇంటికి వెళ్ళాడు గోపాలం. గోపాలాన్ని చూసి సంతోషంతో కావలించుకున్నాడు ప్రసాద్.

గోపాలాన్ని అమెరికాలో అతని జీవితం, కుటుంబం కబుర్లు అడిగి తెలుసుకున్నాడు ప్రసాద్.

అప్పుడే కాఫీ తీసుకుని వచ్చింది సుమ - ప్రసాద్ భార్య. పలకరింపులు అయ్యాక, అక్కడే కుర్చీలో కూర్చున్నది. ఆవిడ అక్కడ యూనివర్శిటిలో, సైకాలజీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నది.

కాఫీ తాగుతూ, "నీ కేబుల్ బిజినెస్ ఎలా వుంది?" అని అడిగాడు ప్రసాద్‌ని గోపాలం.

"అనుకున్న దానికన్నా చాలా బాగుంది. ఐ యామ్ ఎంజాయింగ్ ఇట్" అన్నాడు ప్రసాద్.

ప్రసాద్ మిలటరీలో మేజర్‌గా పనిచేసి, పోయిన సంవత్సరమే వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాడు. తరువాత అతను స్వంత బిజినెస్ ప్రారంభించి, కేబుల్ ఎక్విప్‌మెంట్ డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నాడు.

"ఇంతకుముందు నువ్వు ఇక్కడికి వచ్చినప్పటిలా లేదిప్పుడు. టీవీలో రకరకాల కేబుల్ ఛానల్స్ వచ్చాయి. అన్నీ ప్రైవేటువే. మీ అమెరికన్ ఛానల్స్ కూడా చాలా వస్తున్నాయి. దూరదర్శన్ ఎవరూ చూడటం లేదు. ఎప్పటి నుంచో నాకు స్వంతంగా ఎవరితోనూ సంబంధం లేకుండా, ఏదన్నా చేయాలని కోరికగా వుండేది. అందుకే ఆ ఉద్యోగం మానేశాను. ఇంజనీరింగ్ చదివిన కారణంగా, నా ఉత్సాహం, కోరిక తీర్చుకోటానికి ఈ బిజినెస్ ప్రారంభించాను. ముందు సరదాగానే మొదలు పెట్టినా, ఇప్పుడు ఆర్థికంగా కూడా బాగుంది. నేను ఎప్పటినించో చేద్దామనుకుంటున్నది, ఈ నాటికి సాధ్యపడింది" అన్నాడు ప్రసాద్ తృప్తిగా.

గోపాలానికి వెదుకుతున్న తీగ, కాళ్ళకడ్డం పడినట్టు అనిపించింది.

"ప్రసాద్... నీకో విషయం చెప్పాలి...." అంటూ, విమానంలో తన అనుభవం, తన ఆలోచనలూ, తన అన్న చలపతి భావాలు అన్నీ చెప్పాడు గోపాలం.

చెప్పటం అయ్యాక అన్నాడు - "ఇక్కడ చాలమందిని చూస్తున్నాను. మరీ అరవై ఏళ్ళు కూడా రాకుండానే జీవితంలో అన్నీ పూర్తి అయిపోయినట్టూ, వేరే ఏమీ ఇక చేయలేమనుకుంటూ, నిస్సత్తువగా కనిపించే వాళ్ళు ఎక్కువగా వున్నారు. పూర్వం మా నాన్నగారు, ఇంజనీరుగా రిటైరయాక,

డెభై ఏళ్ళ వయసులో కూడా కన్సల్టింగ్ పని చేశేవారు. డబ్బుకోసమనే కాదు. అదొక వ్యాపకంగా ఉంటుందని. తనకు తెలిసిన, బాగా చేయగలిగిన, తను ఆనందించే పనిని, ఎన్నాళ్ళు చేయగలిగితే అన్నాళ్ళు చేద్దామని. అలాగే ఆ రోజుల్లో, మా కాలేజీలో ప్రొఫెసర్‌గా రిటైరయిన ఇంకొకాయన. ఇలా నాకు తెలిసిన చాలమంది ఉండేవారు. ఏమయింది ఆనాటి ఆరోగ్యం, ఉత్సాహం...''

ప్రసాద్ అన్నాడు - ''నువ్వు ఏదో నిస్సత్తువగా వున్న కొంత మందిని మాత్రమే చూసి, అలా ఊహించుకుంటున్నావనుకుంటాను. ఈ రోజుల్లో కూడా ఎంతోమంది, ఆ వయసులో ఏదో చేస్తూనే వున్నారు. ఉదాహరణకి నన్నే తీసుకో. నేను నీ కన్నా పెద్దవాడినే. గుర్తుందా. నువ్వు నా కన్నా మూడేళ్ళ చిన్నవాడివయినా, నీ మీద జోకులు వేసే వాడిని చిన్నప్పుడు''

''అవును గుర్తుంది. నీకిప్పుడు ఏభై ఏడేళ్ళు వచ్చి వుండాలి. నీ సంగతి వేరు. నీ కెప్పుడూ, ఏదో ప్రత్యేకంగా వుండాలనీ, ఏవేవో చేశేయాలనీ, ఉత్సాహంగా వుండేది'' అన్నాడు గోపాలం.

సుమ అడిగింది, ''నేనొక విషయం చెప్పనా?'' అని.

''చెప్పండి'' అన్నాడు గోపాలం కుతూహలంగా.

ప్రసాద్ అన్నాడు, ''గోపాలం! నీకు సుమ సంగతి చెప్పలేదు. తను కూడా వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని, చిన్న పిల్లలకి ఒక నర్సరీ స్కూలు పెట్టాలనుకుంటున్నది''.

''శుభం. త్వరలో ప్రారంభించండి'' అన్నాడు గోపాలం.

''ఇంకా చాల ప్లానింగ్ చేసుకోవాల్లెండి'' అన్నది సుమ నవ్వుతూ.

కొంచెం ఆగి అన్నది - ''ఇంతకీ నేను చెబుదామనుకున్న విషయం. నా ఉద్దేశ్యంలో, వయసు అన్నది చాల మందిలో శారీరకంగా కన్నా కూడా, మానసికంగా ముందు వచ్చేస్తున్న దనిపిస్తోంది. నిజానికి, అరవై ఏళ్ళ వయసు వృద్ధాప్యం కాదు. మధ్యాప్యం''.

ప్రసాద్ నవ్వాడు - ''ఆమాట తెలుగు మాటేనా? నేనెప్పుడూ వినలేదు'' అన్నాడు.

సుమ అన్నది నవ్వుతూ - ''తెలుగులో ఇదో కొత్త మాట. నా స్నేహితురాలు వసంత, ఒకసారి ఈ మాట వాడింది. ఆ మాట నాకు నచ్చింది. నేను వాడుతున్నాను. అఫ్‌కోర్స్ వితవుట్ హర్ పర్మిషన్''.

గోపాలం కూడా నవ్వి, ''మీరు చెబుతున్నది పూర్తి చేయలేదు. చెప్పండి'' అన్నాడు.

''ప్రపంచంలో చాలా దేశాల్లో - ముఖ్యంగా సంపన్న దేశాల్లో, అరవై ఏళ్ళు పెద్ద వయసు కాదు. ఆర్థిక కారణాల వల్లనో, అక్కడ సగటు ఆయుష్షు ఎక్కువ కావటం వల్లనో, మంచి గాలీ నీరూ వల్లనో ప్రజలు చాల ఆరోగ్యంగా ఉంటారు. సాంస్కృతికపరంగా కూడా, పిల్లలు తక్కువ

వయసులోనే ఇంట్లోనించి బయటకు వెళ్ళి తమ కాళ్ళ మీద తాము నిలబడి, తల్లిదండ్రులకు భారమవరు. ఆ దేశాలు ఆడపిల్లల పెళ్ళిళ్ళకు కట్నాలు తీసుకుని, తల్లిదండ్రులను ఆ వయసులో కూడా పీడించేంత అధోగతిలో లేవు. మన సంస్కృతిలో అలా కాదు మరి. అవన్నీ మానసికంగా కృంగదీస్తాయి. మానసికంగా వృద్ధుడయిన మనిషి, శారీరకంగా అలసిపోవటానికి ఎక్కువ సమయం పట్టదు''.

గోపాలం అన్నాడు - ''ఆర్థికంగా బాగానే వున్న వాళ్ళలో కూడా ఆ ఛాయలు కనిపిస్తున్నాయి. ఉదాహరణకి, నాతోపాటూ విమానంలో ప్రయాణం చేసిన ఆవిడనీ... అంతెందుకు... మా అన్నయ్య చలపతినే తీసుకోండి. ఆయనకి ఏనాడూ డబ్బుకి ఇబ్బంది లేదు. ఉద్యోగంలో వున్నప్పుడు, తన సంతోషం కోసం ఎన్నో చేయాలనుకున్నాడు. అయినా సంసార బాధ్యతలవల్ల చేయలేకపోయాడు. ఇప్పుడు అవన్నీ పూర్తి చేశాక, తన ఇష్టాల సంగతి వదిలేసి ఇక జీవితంలో అంతా తీరిపోయినట్టు మాట్లాడతాడు!''

''మీ అన్నయ్యగారి సంగతి నాకు బాగా తెలుసు. ఆయన రాష్ట్ర ప్రభుత్వంలో ఎన్నో సంవత్సరాలు పనిచేసి, ఒక విధమైన బద్ధకం అలవాటు చేసుకున్నాడు. ఇలా అంటున్నానని ఏమీ అనుకోకు. నాకు తెలిసిన చాల మందిలో అదే తరహా'' ప్రసాద్ నవ్వుతూ అన్నాడు.

గోపాలం మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నాడు.

సుమ అన్నది - ''కొంతమంది ఈ రకంగా ఉంటారేమో కాని, అలా జనరలైజ్ చేయటం భావ్యం కాదు. బహుశా ఆయనకి, జీవితంలో పెద్ద అభిలాషలూ, కోరికలూ లేక పోవచ్చు. అన్ని బాధ్యతలూ తీరిపోయాయి కనుక, ఉన్నంతలో సరిపెట్టుకుని, నిశ్చింతగా, తృప్తిగా వుండటం ఆయన ఉద్దేశ్యం కావచ్చు కదా''

''ఏమో... ఆ విషయాన్ని నా మనసు అంగీకరించటం లేదు! నేనయితే అలా చేయను'' అన్నాడు గోపాలం.

ప్రసాద్ నవ్వుతూ అన్నాడు. ''అమెరికా వెళ్ళాక, నువ్వు పెద్ద భౌతికవాది వయిపోయావని పిస్తోంది నాకు''

గోపాలం చిన్నగా మందహాసం చేశాడు.

ప్రసాద్ అన్నాడు - ''నీకు ముళ్ళపూడి వెంకట రమణగారి జోకు గుర్తుందా. ఒక చెట్టు కింద, కాలి మీద కాలేసుకుని పడుకుని ఉంటాడొకడు. ఒక పెద్దమనిషి అక్కడికి వచ్చి, ''ఎందుకయ్యా! అలా బద్ధకంగా పడుకుని జీవితం వృథా చేసుకుంటావు. ఏదన్నా, పని చేసుకో

రాదూ" అంటాడు. "ఊ (పని చేస్తే..." అంటాడతను. "డబ్బు సంపాదించుకోవచ్చు" అంటాడా పెద్ద మనిషి. "డబ్బు సంపాదిస్తే?" అడుగుతాడా బద్ధకిస్టు. "చక్కటి ఇల్లు కట్టుకోవచ్చు" అంటాడు పెద్ద మనిషి. "ఇల్లు కట్టు కుంటే..." అడుగుతాడు బద్ధకిస్టు. "ఇల్లు కట్టుకుంటేనా! ఇంటివెనక, మామిడి చెట్టు కింద కాలు మీద కాలేసుకుని హాయిగా పడుకోవచ్చు" అంటాడు. అప్పుడు బద్ధకిస్టు నవ్వి "ఇప్పుడు నేను చేస్తున్న పని అదేగా" అంటాడు"

సుమ, గోపాలం నవ్వారు.

"అవును ఆ జోకు నాకు బాగా గుర్తుంది. నవ్వితే నవ్వండి వీడియోలో చూశాను. నాకు ఎంతో నచ్చిన జోకు" అన్నాడు గోపాలం.

"జీవితంలో తను అనుకున్నవన్నీ సాధించి, ఒక విధమైన తృప్తి, అంటే కంటెంట్‌మెంట్ సంపాదించుకుని, ఇక జీవితంలో సాధించేదేమీలేదు అనుకునే స్థితిలోకి మనిషి వచ్చినప్పుడు మహర్షి అవుతాడని ఎక్కడో చదివినట్టు గుర్తు" అన్నాడు ప్రసాద్.

"ఏమో నాకు మాత్రం గుర్తులేదు" అన్నది సుమ నవ్వుతూ.

"ఇంతకీ నీ ప్రశ్నకి జవాబు దొరికిందా?" అడిగాడు ప్రసాద్.

"దొరికినట్టే అనిపిస్తున్నది. వయసు అన్నది శరీరానికి కాదు, మనసుకి అని. వివిధ కారణాల వల్ల, మనిషికి మధ్యాహ్నంలోనే - వృద్ధాప్యం వచ్చేస్తుందని. అలాగే మన మనసులోని భావాలను కొంచెం మరమ్మతు చేయగలిగితే, వృద్ధాప్యంలోకూడా యవ్వనంలోకి వెళ్ళవచ్చని. అమెరికాలో మా ఊళ్ళో శాస్త్రిగారికి, ఆ మధ్య గుండె మార్పిడి చేసి, పదిహేడేళ్ళ కుర్రాడి గుండె పెట్టారు. అప్పుడు ఆయన అంటుండేవారు "ఐ యామ్ యంగ్ ఎట్ హార్ట్" అని. మేమందరం ఆ మాటని సరదాగా తీసుకుని నవ్వుకునే వాళ్ళం. కాని అదే నా ప్రశ్నకు జవాబు అని ఇప్పుడు తెలిసింది" అన్నాడు గోపాలం నవ్వుతూ.

*(విపుల మాస పత్రిక: 2000)*